

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన ఆశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

## సాగి ఆగిన యాత్ర

ఈమధ్యనే నీలంరాజు వేంకటశేషయ్యగారు కన్నుమూశారు. పేపరు తెరుస్తూనే ఆచంట జానకి రాంగారు పోయినట్టు వార్త. బహుశా ఆ తరం మనుషుల్లో ఆఖరి వ్యక్తులు ఒక్కొక్కరే సెలవు తీసుకుంటున్నారు. గతంలో శేషయ్యగారితో కలిసి పనిచేసే అదృష్టం కలిగింది. నిజానికి నా జీవితంలో మొదటి ఉద్యోగాన్ని సబ్ ఎడిటర్‌గా ఇచ్చింది ఆయనే. జానకిరాంగారు వయస్సులోనూ, తరంగానూ నాకంటే ముందున్నవాడు. జానకిరాంగారు మద్రాసులోనే 88వ ఏట పోయారని చదివి ఆశ్చర్యపోయాను. సాహితీపరులకి, ఇంకా ఆ తరం మనుషులకే తప్ప చాలామందికి ఆయన్ని గురించి తెలీదేమో. ప్రముఖ విద్య శిఖామణి ఆచంట లక్ష్మీపతిగారి పుత్రులని చెప్పడం ఆయనకి అన్యాయం చేసినట్టు అవుతుంది. ఆయన 'సాగుతున్నయాత్ర'ని చదివిన వారెవరూ ఆయన్ని మరచిపోలేరు ఆ రోజుల్లో 'ఆంధ్రప్రభ'లో ధారావాహికంగా వచ్చిన అతి ప్రముఖమైన ఆత్మకథ జానకీరాంగారిది. 88 సంవత్సరాలపాటు ఆ యాత్రని సాగించిన అదృష్టవంతులు. మొదటిభాగంలో తన మాతృమూర్తి కాలధర్మాన్ని ఎంత ఆర్ద్రంగా, కంటతడిపెట్టించేలాగ వ్రాశారో ఇప్పటికీ గుర్తుంది.

నేను చిత్తూరులో పనిచేసే రోజుల్లో దినపత్రిక ఆఫీసుకి వచ్చారు. అప్పుడు ఆయన తిరుపతిలో ఉండేవారు. సతీమణి ఆచంట శారదాదేవిగారికి పద్మావతీ కళాశాలలో ఉద్యోగం. ఆయన నాకు తెలుసు. పరిచయమయిన అరగంటలోనే నేను విశాఖపట్నం రైలుకి వెళ్ళాలి. వెళ్తున్నా అని బాధపడుతూ బయలుదేరాను. రైలు బయలుదేరే సమయానికి కంపార్టుమెంటులన్నీ వెదికి, రైలెక్కి, నాతోపాటు పాకాలవరకు కబుర్లు చెప్తూ ప్రయాణం చేశారు. సాగుతున్న యాత్ర, శారదాదేవిగారి కథల పుస్తకం నేను సమీక్ష చేయాలంటూ నాకిచ్చి రైలు దిగిపోయారు. ఆ తర్వాత ఆ రెండింటి మీదా సమగ్రంగా సమీక్షలు వ్రాసిన గుర్తు. అప్పుడే "మీలాంటివారు రేడియోలో ఉండాలి. అప్లై చేయండి" అని ప్రోత్సహించింది ఆయనే.

నా జీవితంలో మొదటి ఉద్యోగానికి ప్రోత్సాహం శేషయ్యగారిదయితే, రెండో ఉద్యోగానికి ప్రోత్సాహం జానకిరాంగారిది. మూడో ఉద్యోగం నేను చెయ్యలేదు.

రేడియోలో ఆయన అనుభవాలు, అనుభూతులూ, ప్రసారాల్లో విచిత్రమైన సాధక బాధకాలూ సాగుతున్న యాత్ర చదువుతుంటే రేడియోలో ఆ తర్వాత పనిచేసిన నాలాంటి వారికి మార్గదర్శకాలుగా ఉండేవి. అతి సరళమయిన వ్యక్తి. మాట సరళం, రచన సరళం. జీవితంలో, జీవనంలో, దృక్పథంలో ఎప్పుడూ కళాత్మకమయిన దృష్టిని వదలని వ్యక్తి జానకీరాంగారు. తిరుపతిలో కపిలతీర్థం రోడ్డులో వారింట్లో రెండు రోజులున్న గుర్తు. ఆయన వేసిన చిత్రాలు చూపించి, రచనలు చదివి వినిపించారు.

సాహితీవ్యాసంగం ఆయన అభిరుచి. కళాత్మకమయిన జీవనం ఆయన నైజం. తిరుపతి నుంచి చిత్తూరు బస్సు ఎక్కిస్తూ చక్కటి గులాబిపువ్వుల్ని నా చేతుల్నిండా పెట్టిపంపారు.

వారిమీద ఠాగోర్ ప్రభావం చాలా ఉంది ఠాగోర్ శత జయంత్యుత్సవాల కన్వీనర్‌గా ఆయన ఉన్నారు. నాకు బాగా గుర్తు. 1961 డిసెంబర్ 16న మా ఆవిడ కాపురానికి వచ్చిన రోజు. చిత్తూరులో వారి అధ్యక్షతన ఠాగోర్ ఉత్సవాల సందర్భంగా సభలో ఇద్దరం పాల్గొన్నాం. పూలదండలతో, పూలతో వచ్చి ఇంట్లో భోజనం చేసి వెళ్ళారు. నేను రేడియోలో చేరానని తెలిసి చాలా ఆనందించిన వ్యక్తుల్లో జానకిరాంగారు ఒకరు.

చేసిన ప్రతి పనిలోనూ, వృత్తిలోనూ కమిట్‌మెంటు ఉన్నతరం అది. ఇచ్చిన జీతం కోసం కాక ప్రతిదినాన్ని ప్రతి పనినీ ఒక అనుభవం, ఒక జ్ఞాపకం చేసుకున్న తరం అది. ఆ రోజుల్లో రేడియోలో జి.టి శాస్త్రిగారూ, బాలసుందరంగారూ, అయ్యగారి వీరభద్రరావుగారూ - వారితో పనిచేసిన రోజులూ అందమైన కలల్లాగా అనిపిస్తాయి.

జానకిరాంగారు ఉత్తరం రాసే పేపరూ, పోస్టు కార్డు, ఉత్తరాలు రాసే వైనం అన్నీ ప్రత్యేకం. ఆ ఉత్తరాన్ని ఎంత శ్రద్ధగా, ఎంత ప్రత్యేకంగా నా కోసమే కలం పుచ్చుకుని వ్రాశారని గర్వపడాలనిపించేంత శ్రద్ధ, అభిమానం కనిపించేది. ఒక తరం చిన్నవాడినయిన నాపట్ల ఆయన చూపించిన వాత్సల్యం, గౌరవం, అభిమానం, కొన్ని దశాబ్దాలపాటు జ్ఞాపకాలుగ మిగిలిపోయాయి.

"ఆ రోజుల్లో" అని ఈ రోజుల్లో చెప్పడం చాదస్తం. "మా రోజుల్లో" అని చెప్పడం వృద్ధాప్యానికి చిహ్నం. డైరీలు తిరగేసి ఆత్మకథ రాసే రోజులు ఇంకా ముందున్నా ఆ రోజుల్లోని 'మైలురాళ్ళు'ను దాటి పోతున్నప్పుడు వెనక్కి తిరిగి చూస్తే గుండె గొంతులో కొట్టాడుతుంది.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments